క్లుప్తంగా

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా శనివారం ప్రణవి శిష్య బృందంచే నిర్వహించిన ఆంధ్రనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కుంభ హారతి, అలరింపు, మూషిక వాహన, వినాయక కౌతం, త్రిపుర సంహార శబ్దం, చక్కని తల్లికి తదితర అంశాలను ప్రదర్శించి కళాకారులు మెప్పించారు.

స్వచ్ఛత అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరణ

బోడుప్పల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛత మహోత్సవం-2023లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు కోసం మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కమిషనర్ పద్మజారాణి తెలిపారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం ఆమె మాట్లాడుతూ.. 'పట్టణ పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ'పై చిరు వ్యాపారులు, స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వ్యాపారులు, స్టార్టప్ సంస్థలు నిర్వహిస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పూర్తి వివరాల కోసం నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



జోడో యాత్రలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు



రామంతాపూర్‌లో జోడో యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం శివనగర్, రేణుకానగర్, సైనిక్ విహార్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటికి ఇద్దరు, ముగ్గురు అర్హులు ఉంటే ఒక్కరికే పెన్షన్ ఇస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ రూ.2,500 పెన్షన్ ఇస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు టి.వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మీడియా కన్వీనర్ గుత్తి చందు, కె.రాములు, వి.శ్రీనివాస్‌గౌడ్, రాజలింగం, సంతోష్‌ముదిరాజ్, వంశీముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్, కేటీఆర్ నగర్, శ్రీరామ కాలనీల్లో శనివారం నిర్వహించిన జోడో యాత్రకు నియోజకవర్గ ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడల్లా మంత్రి కేటీఆర్ రామంతాపూర్‌లోని కేసీఆర్ నగర్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ప్రకటించి ఎన్నికలు ముగియగానే ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సీఎం, మంత్రి పేర్లతో ఉన్న బస్తీల్లో కనీస సౌకర్యాలు లేవని, వచ్చే ఎన్నికల్లో ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆగిరెడ్డి, గిరిబాబు, మురళీగౌడ్, భాగ్యలక్ష్మి, సుజాత, జ్యోతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శనివారం అందజేశారు. ప్రణలి హేమరాజ్ గోవందే కుటుంబ సభ్యులకు రూ.2లక్షల విలువైన చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రవికుమార్, భాజీ పాషా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏఎస్‌రావునగర్ డివిజన్ ఈసీఐఎల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్స్ సొసైటీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు డ్రైనేజీతో ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

రోడ్లపై పేరుకుపోతోన్న వ్యర్థాలు



మిర్జాల్‌గూడ దర్గా ఎదురు గల్లీలో పేరుకుపోయిన వ్యర్థాలు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. దీంతో ఆ ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, మిర్జాల్‌గూడ, జ్యోతినగర్, గోపాల్‌నగర్ కల్వర్టు, ఇందిరానెహ్రూనగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతోంది. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో చెత్తను తరలించడంలో అలసత్వం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వ్యర్థాల కారణంగా దోమలు, ఈగలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పక్కన వేసే వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారం



తనకు ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరుతున్న విజయ్‌కుమార్

ఉప్పల్: ఉపాధ్యాయులంతా తనకు అండగా నిలిచి ఎన్నికల్లో గెలిపించాలని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన అనుభవం ఉన్న తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని బీజేపీ ప్రచారం

మల్లాపూర్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మోజార్టీతో గెలిపించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి, ఎన్నికల ప్రచార ఇన్‌చార్జి పాతగాని గోపాల్‌గౌడ్ ఉపాధ్యాయులను కోరారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా నాచారంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి హన్మంత్ బిరదర్, పన్నా ప్రముఖ్ క్రాంతికుమార్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యూటీ' స్టోర్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంలో సౌందర్యం కీలక పాత్ర పోషిస్తుందని టీవీ యాంకర్ శ్రీముఖి తెలిపారు. ప్రస్తుత తరంలో అందం, ఆరోగ్య సంరక్షణకు ఆదరణ పెరిగిందని ఆమె అన్నారు. నగరంలోని ఏఎస్‌రావు నగర్ వేదికగా స్కంధన్షి రిటైల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యూటీ అండ్ బియాండ్ స్కిన్ కేర్ స్టోర్‌ను శ్రీముఖి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులతో పాటు అన్ని రకాల సౌందర్య ఉత్పత్తులను ఒకే వేదికపై అందించడం అభినందనీయమన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అంబికాగౌడ్

అల్వాల్: పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని అల్వాల్ ఎస్‌ఐ అంబికాగౌడ్ అన్నారు. శనివారం అల్వాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటల నుంచే పారిశుద్ధ్య కార్మికులు రోడ్లపైకి వచ్చి శుభ్రం చేస్తున్నారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్‌ఓ మంజుల, శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది శిరీష, మాధవి, యోగిత, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు ప్రారంభం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: నాచారం న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం 11వ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మేకల ముత్యంరెడ్డి, సీఎస్ బ్రదర్స్ మల్లేష్, కేశవరావు, సత్తయ్యయాదవ్, డాక్టర్ రమేష్, టిల్లు, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొని పూజలు చేశారు.

పిండి వంటల ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళలు తయారు చేసిన పలు రకాల పిండి వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సర్కిల్ డీసీ అరుణకుమారి హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రక్షణ వ్యవస్థలో, సాఫ్ట్‌వేర్ రంగంలో, వ్యాపార రంగంలో మహిళలు సత్తా చాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉప్పల్ ఏఎంసీ శైలజ, ప్రాజెక్టు అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ బోర్డుల తొలగింపు

బోడుప్పల్: బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారిలో ఉన్న ఫ్లెక్సీ బోర్డులను కమిషనర్ పద్మజారాణి ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా పద్మజారాణి మాట్లాడుతూ.. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిని తొలగించినట్లు వెల్లడించారు. ప్రకటనలకు సంబంధించిన బోర్డులు, లైటింగ్ బోర్డులు, వితౌట్ లైటింగ్ బోర్డులు రోడ్డుకు ఇరువైపులా ఉంటే వాటికి ఆన్‌లైన్‌లో చలానా కట్టాలని ఆమె సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం

ఉప్పల్: కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధుల సహకారంతోనే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని ఉప్పల్ సీఐ గోవింద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సాయిరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం లేకున్నా ఆన్‌లైన్‌లో కనిపించే సైట్స్ లింకులు ఓపెన్ చేయొద్దని, ఓటీపీలను ఇతరులతో షేర్ చేసుకోవద్దని చెప్పారు. కళాశాల విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని, వారి విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రాజేందర్ రెడ్డి, ఎస్‌ఐ శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

కుషాయిగూడ: సాక్షి గణపతి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌బీకాలనీ కైలాసగిరి కమాన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పోలేపాక అంజయ్య, జలగం వెంకటేష్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, పూస రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఉప్పల్ డీఎస్ఎల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఉప్పల్ ప్రధాన రహదారి వరంగల్ నేషనల్ హైవేకు ఇరువైపులా రోడ్డు వేయాలని కోరుతూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మీర్‌పేట్, హెచ్‌బీ కాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫైర్



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుషాయిగూడ: ఎమ్మెల్సీ కవిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి డిమాండ్ చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయన మాటలు మహిళలను కించపరిచేలా ఉన్నాయన్నారు. బీజేపీ కక్షపూరిత చర్యలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, బొడిగె ప్రభుగౌడ్, శేర్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ చౌరస్తాలో..

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేకల హనుమంత రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొప్పు నర్సింగ్‌రావు, కొండల్ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.